ప్రజాశక్తి
మంగళవారం 20 జూన్ 2023
5
అల్లూరి సీతారామరాజు

ఆశ్రమాల్లో సబ్జెక్టు టీచర్లను భర్తీ చేయాలి

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఏజెన్సీలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పదోన్నతులపై సబ్జెక్టు టీచర్ల ఖాళీలను భర్తీ చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఐటిడిఎ వద్ద విలేకరులతో మాట్లాడుతూ, పాడేరు ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో గణితం, ఫిజిక్స్ వంటి సబ్జెక్టు టీచర్లు కొరతతో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని అన్నారు. దీంతో, విద్యార్థులు, తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఈ విషయమై గిరిజన సంక్షేమ శాఖ అధికారి, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారికి యుటిఎఫ్ విన్నవించిందన్నారు. ఆశ్రమ పాఠశాలలో ఖాళీ సబ్జెక్ట్ టీచర్ పోస్టులలో సెకండరీ గ్రేడ్ టీచర్లకు త్వరితగతిన ప్రమోషన్లు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు నాగేశ్వరరావు, పాడేరు మండల ప్రధాన కార్యదర్శి కర్రి బాబు, ఎస్.పరమేష్‌లు పాల్గొన్నారు.

మహా పాదయాత్రకు కదులుతున్న పోలవరం నిర్వాసితులు

- ★ విస్తృతంగా ప్రచారం చేసిన సిపిఎం శ్రేణులు
- ★ నేడు నెల్లిపాకలో ప్రారంభం
- ★ 15 రోజులు.. 400 కిలోమీటర్లు
- ★ జులై 4న విజయవాడలో ముగింపు

ప్రజాశక్తి-ఎటపాక

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యాన ఈనెల 20న మంగళవారం మండలంలోని నెల్లిపాకలో ప్రారంభమవుతున్న పోరుకేక మహాపాదయాత్రకు నిర్వాసితులు పెద్ద సంఖ్యలో కదులుతున్నారు. ఈ పాదయాత్రకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసినట్లు యాత్ర మేనేజర్ మర్లపాటి నాగేశ్వరరావు ప్రజాశక్తికి తెలిపారు.

పోలవరం నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పునరావాసం, పరిహారం కల్పించాలని, గోదావరి వరదల నుంచి ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని, తప్పుల తడకగా ఉన్న కాంటూరు లెక్కలను మార్చాలని, 1986, 2022 సంవత్సరాలలో గోదావరి వరదలలో మునిగిన గ్రామాలన్నింటినీ మొదటి దఫా పరిహారంలో చేర్చాలని ప్రధాన డిమాండ్లతో సిపిఎం ఈ పాదయాత్రను నిర్వహిస్తుంది. దీని జయప్రదానికి గత 15 రోజులుగా పాదయాత్ర ప్రాధాన్యతను తెలుపుతూ ఎటపాక, చింతూరు,

నిర్వాసితుల ఇళ్లకు వెళ్లి పాదయాత్ర గురించి వివరించి, ప్రశ్నావళి ద్వారా వివరాలు సేకరిస్తున్న సిపిఎం కార్యకర్తలు

కూనవరం, విఆర్.పురం తదితర నాలుగు నిర్వాసిత మండలాల్లోని గ్రామాలలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేశారు. జనరల్ బాడీ మీటింగ్‌లు, గ్రూప్ మీటింగ్‌లు, ఇంటింటి ప్రచారం, వాల్ పోస్టర్లు, కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. పలు సమావేశాల ద్వారా అన్ని పార్టీలు, సంఘాలు, వర్గాల మద్దతును కోరారు. పాదయాత్ర ప్రారంభం సందర్భంగా భారీ బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల నిర్వాసితులు పడుతున్న నష్టాలు, ఇబ్బందులపై సిపిఎం ప్రజలను చైతన్యం చేసి అనేక నిరసనలు ఉద్యమాలు చేయడం జరిగింది. కాని ప్రభుత్వాలు నిర్వాసితులను పట్టించుకోకుండా, వారిని గాలికొదిలేసి ప్రాజెక్టు నిర్మాణంపైనే శ్రద్ధ చూపడంతో నేడు నిర్వాసితుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. ఈ నేపథ్యంలో పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలంటూ సిపిఎం ప్రారంభిస్తున్న మహా పాదయాత్రకు అన్ని వర్గాల ప్రజల నుండి మంచి స్పందన లభిస్తుంది. 15 రోజుల పాటు 400 కిలోమీటర్లు మేరకు సాగే ఈ పాదయాత్ర జులై 4న విజయవాడలో ముగియనుంది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వంలో ఈ పాదయాత్రలో జరగనుండడంతో దీనిని జయప్రదం చేయడానికి పార్టీ శ్రేణులన్నీ ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు.

నినాదాలు చేస్తున్న స్టాఫ్ నర్సులు, నాయకులు

రెగ్యులర్ చేయాలని.. కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల నిరసన

ప్రజాశక్తి-పాడేరు: ప్రభుత్వం తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రి, జిల్లా ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. గత కొంతకాలంగా సర్వీస్ చేస్తున్నామని, కరోనా సమయంలో ప్రాణాలు పణంగా పెట్టి పని చేశామని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ కన్వీనర్ శెట్టి నాగరాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వంకాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరిని రెగ్యులర్ చేస్తామని ప్రకటించడంతో స్టాఫ్ నర్సులు ఆశగా ఎదురు చూశారన్నారు. ప్రభుత్వం నిబంధన ప్రకారం కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌లకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. తక్షణం వారి సర్వీస్‌ని దృష్టిలో పెట్టుకొని రెగ్యులర్ చేయాలని అందుకు జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, జూన్ 2, 2014 నాటికి ఐదు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న 6,662 మంది రెగ్యులర్ చేస్తామనిరాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, సమయంలో కాదని తెలిపారు. నిబంధనలను మార్చు చేసి ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఐటిడిఎ పరిధిలో ఉన్న బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని తెలిపారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సుల కమిటీ ప్రతినిధులు డి.ధనలక్ష్మి, జి.పద్మలత, టి.చిలకమ్మ సిహెచ్ స్వాతి, బి.భారతి వి.రమాదేవి, ఎం.వసంత కుమారి పాల్గొన్నారు.

రెడ్ షర్ట్ వాలంటీర్లదే కీలకపాత్ర

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి- చింతూరు

పోలవరం నిర్వాసితుల మహా పాదయాత్రలో రెడ్ షర్ట్ వాలంటీర్లదే కీలక పాత్ర అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. పాదయాత్ర ఏర్పాట్లలో భాగంగా సోమవారం చింతూరు వచ్చిన ఆయన వెంకట్ రెడ్డి భవన్లో మీడియాతో మాట్లాడారు. నెల్లిపాక నుండి విజయవాడ వరకు 14 రోజులు 400 కిలోమీటర్లు ఈ మహా పాదయాత్ర జరుగుతుందని తెలిపారు. రెడ్ షర్ట్ వాలంటీర్లుగా ప్రతి మండలం నుండి 14 రోజులు నడిచేందుకు ముంపు నిర్వాసితులే సిద్ధమై వస్తున్నారని తెలిపారు. మంగళవారం నాటి సభకు వామపక్ష పార్టీలు, ప్రజా, గిరిజన ఆదివాసీ సంఘాల నాయకులు హాజరవుతారని చెప్పారు. యాత్రలో ప్రజానాట్యమండలి కళాకారులు, డప్పు కళాకారులు, ప్రజలను ఉత్సాహపరిచి ఆటపాట ద్వారా చైతన్య పరుస్తారని పేర్కొన్నారు. యాత్రకు పెద్ద ఎత్తున స్వాగతాలు పలికేందుకు ఊరూరా నిర్వాసితులు సన్నాహాలు చేసుకుంటున్నారని తెలిపారు. 26న రంపచోడవరం జిల్లా నుండి ఏలూరు జిల్లా రుద్రంకోటకు పాదయాత్ర చేరుకుంటుందని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, నాయకులు పల్లపు వెంకట్, యర్రంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కూనవరం : మహాపాదయాత్ర వాల్ పోస్టర్లను మండల కేంద్రంలోని మార్తా శ్రీరామ్మూర్తి భవన్ సీపీఎం జిల్లా నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం ముంపు ప్రజలకు జరుగుతున్న మోసాన్ని తెలుగు రాష్ట్రాలకు చాటి చెప్పడానికి ఈ మహా పాదయాత్రను చేపట్టినట్లు తెలిపారు. ముంపు గ్రామాల ప్రజలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గారడీ చేస్తూ మోసం చేస్తున్నాయని విమర్శించారు. కాంటూరు, లైడార్ అని మోసపూరిత మాటలు చెబుతూ ముంపు ప్రజలను అయోమయంలో పడేస్తున్నాయని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి నిర్వాసితుడు ఈ పాదయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సీనియర్ నాయకులు తలగాని నాగరాజు, కుంజా రాధ, తాళ్లూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఐ బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం నిర్వాసితుల న్యాయ మైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన సోమవారం మండల కేంద్రం రేఖపల్లి నుండి ఎమ్మార్వో కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మండ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ సర్వేల పేరుతో కాలం వెళ్లదీస్తున్న పాలక ప్రభుత్వాలు కళ్ళు తెరిపించాలని ఈ నెల 26న పోలవరంలో జరిగే బహిరంగ సభకు నిర్వాసితులు తరలి రావాలని పిలుపునిచ్చారు. గతంలో లక్షా 15వేల రూపాయలు ఇచ్చిన భూములకు ముఖ్యమంత్రి హామీ మేరకు రూ.5 లక్షలు ఇవ్వాలని, గిరిజనులతో సమానంగా గిరిజనేతరులకు ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇవ్వాలని, మండలాన్ని యూనిట్‌గా తీసుకొని ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కర్నాటి రాంబాబు, ఏసు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఐ ర్యాలీకి సిపిఎం మద్దతు

చింతూరు : పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఐ నిర్వహించిన బైక్ ర్యాలీకి చింతూరులో సిపిఎం నాయకత్వం స్వాగతం పలికి సంఘీభావం తెలియజేసింది. 20వ తేదీ నుండి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వంలో జరుగు నిర్వాసితుల మహా పాదయాత్రకు సంఘీభావం తెలియజేయాలని సిపిఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ ర్యాలీలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి, జిల్లా నాయకులు దుర్గాప్రసాద్, బుజ్జా మోహన్‌రావు పాల్గొన్నారు. సంఘీభావం తెలియజేసిన వారిలో సిపిఎం నాయకులు కుంజ సీతారామయ్య, యర్రంశెట్టి శ్రీనివాసరావు, పల్లపు వెంకట్, సీసం సురేష్, పోడియం లక్ష్మణ్, ఎండి సలీం ఉన్నారు.

సిపిఐ బైక్ ర్యాలీకి సంఘీభావం తెలుపుతున్న సిపిఎం నాయకులు

రోడ్డు పనులు చేస్తున్న గిరిజనులు

శ్రమదానంతో రోడ్డు పనులు

ప్రజాశక్తి-హుకుంపేట: శ్రమదానంతో రహదారి పనులను పనసబండ గ్రామస్తులు చేపట్టారు. మండలంలోని తీగల వలస పంచాయతి పనసభంద, కిన్నెరలోవ గ్రామాల రహదారి వర్షానికి కోత గురై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తులు శ్రమధానంతో మరమ్మతులు సోమవారం చేపట్టారు. అధికారుల స్పందించక పోవడంతో తాత్కాలికంగా శ్రమదానంతో మరమ్మతులు చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు గుర్తించి రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతిని ప్రారంభించాలి

- గాలికొండ ఎంపిటిసి సభ్యులు బుజ్జిబాబు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరు బాలికల ఆశ్రమం పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిని ప్రారంభించాలని సిపిఎంకు చెందిన గాలికొండ ఎంపీటీసీ సభ్యులు అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సుదీర్ఘ ప్రాంతాల నుంచి వచ్చి సీలేరు బాలికల ఆశ్రమం పాఠశాలలో గిరిజన విద్యార్థినులు చదువుకుంటున్నారని తెలిపారు. పాఠశాల ఏర్పాటు చేసి సంవత్సరాలు గడుస్తున్న పదవ తరగతి ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. ఇక్కడ తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులు చదివి 10వ తరగతి చదువుకోటానికి జీకే వీధి, చింతపల్లి, పాడేరు తదితర ప్రాంతాలకు వెళ్ళవలసిన దుస్థితి నెలకొందని వాపోయారు. ఇదే పాఠశాలలో పదో తరగతి ప్రారంభిస్తే విద్యార్థులకు తల్లిదండ్రులకు ఎటువంటి సమస్యలు తలెత్తువని పేర్కొన్నారు. ఈ ఏడాది పదో తరగతి ప్రారంభించడానికి ఐటీడీఏ పీఓ అభిషేక్, కలెక్టర్ సుమిత్ కుమార్ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లేకుంటే విద్యార్థులు తల్లిదండ్రులతో పాఠశాల ముందు ఆందోళన చేపడతామని ఎంపీటీసీ బుజ్జిబాబు హెచ్చరించారు.

ఎంపిటిసి బుజ్జిబాబు

'జన్ భాగీరాది'పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధిలో జన్ భాగీరాది కార్యక్రమంపై అంగన్వాడీ టీచర్ ఎ.యశోద ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక విద్యను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు నెంబరు పుట్టపల్లి కాసులమ్మ, ఏ సుహాసిని, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

90 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - కొయ్యూరు

మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు 90 శాతం సబ్సిడీపై విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ బడుగు రమేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో విత్తనాలు అందిస్తూ గిరిజన రైతుకు 90శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జయతి రాజులమ్మ, వైసిపి మండల నాయకులు జల్లి బాబులు, మండల వ్యవసాయ అధికారిని ఉమాదేవి, రైతులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

విత్తనాలు అందజేస్తున్న ఎంపిపి రమేష్ తదితరులు

జిఒ 3కు చట్టబద్ధత కల్పించాలి

-అధికారులకు ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నేతల వినతి

పాడేరులో వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

ప్రజాశక్తి-పాడేరు: జిఓ 3కు చట్టబద్ధత కల్పించి గిరిజనేతర ఉపాధ్యాయులను ఏజెన్సీకి చేసిన బదిలీలను వెంటనే రద్దు చేయాలని ఎపి ఆదివాసి గిరిజన సంఘం నేతలు సోమవారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాల్ దేవ్ మాట్లాడుతూ, జి.ఓ 3 నిబంధనల ప్రకారం పాడేరు ఏజెన్సీలో ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ నిర్వహించాలన్నారు. జిఓ 3పై సుప్రీంకోర్టులో పిటిషన్ నడుస్తుడంగా ఏజెన్సీలో మైదాన ప్రాంతానికి చెందిన గిరిజనేతర సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటి) 400 మందిని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు బదిలీ చేయడం తగదన్నారు. గిరిజనేతర ఉద్యోగులను గిరిజన ప్రాంతానికి తరలించడం గిరిజన హక్కులకు తీవ్ర భంగం కలుగుతుందని అన్నారు. తసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుందరరావు, మండల కార్యదర్శి సత్యనారాయణ, పాపారావు, కృష్ణ, దాసు ,తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: జిఓ 3ను చట్టబద్ధత కల్పించి మైదాన ప్రాంత గిరిజనేతర ఉపాధ్యాయుల ఏజెన్సీలో బదిలీలను వెంటనే రద్దు చేయాలని ఏపీ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, గిరిజనేతర ఉద్యోగులను గిరిజన ప్రాంతానికి తరలించడం గిరిజన హక్కులకు తీవ్ర భంగం కలిగించే విధంగా ఉందని తక్షణమే బదిలీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ 3పై ఎందుకు రివ్యూ పిటిషన్ దాఖలు చేయలేదని ప్రశ్నించారు.జిఓ 3 నిబంధనల ప్రకారం పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన ప్రాంత ఉపాధ్యాయుల గిరిజన ప్రాంతాల్లో బదిలీలు ప్రక్రియ మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, మండల అధ్యక్ష కార్యదర్శులు రామన్న, బుజ్జి బాబు, కె.జగనాధం, ఆనంద్, హరి, తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: జిఓ 3కు చట్టబద్ధత కల్పించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. తహసీల్దార్ సిహెచ్ నాగమ్మకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గిరిజనేతర ఉపాధ్యాయులను గిరిజన ప్రాంతానికి బదిలీ చేయడమంటే గిరిజన హక్కులకు తీవ్ర భంగం కలిగించడమే అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల నాయకులు పి.మోహన్దాస్ పాల్గొన్నారు.



దుంబ్రిగుడలో...

ముంచింగిపుట్టు: జీవో 3కు చట్టబద్ధత కల్పించాలని తహశీల్దార్ నరసమ్మకు ఎపి ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొర్ర త్రినాథ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా త్రినాధ్ మాట్లాడుతూ,జి ఓ 3 పై సుప్రీంకోర్టులో పిటిషన్ నడుస్తుండగా మైదాన ప్రాంతానికి చెందిన గిరిజనేతర సెకండరీ గ్రేడ్ టీచర్లను ఏజెన్సీకి బదిలీ చేయడం దుర్మార్గమన్నారు. దీంతో గిరిజన హక్కులకు తీవ్ర భంగం కలుగుతుందన్నారు. బదిలీలను తక్షణమే రద్దు చేయకుంటే దశలవారీగా ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపిపి1 పి.సత్యనారాయణ, నాయకులు పి.భీమరాజు, ఎస్.దొన్ను పాల్గొన్నారు.

పెదబయలు : జిఓ 3ఎ చట్ట బద్ధత కల్పించాలని తహసీల్దార్‌కు ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నేత సాగిన ధర్మన్న ఆధ్వర్యంలో వినతి సమర్పించారు.

పాడేరులో వినతిపత్రం అందజేస్తున్న సురేంద్ర, నాయకులు

సాగిన ధర్మన్న మాట్లాడుతూ, కోర్టు తీర్పు రాకుండా కొత్త నియమాలు, బదిలీలు చేపట్టడం చట్ట విరుద్ధమన్నారు. బదిలీలను నిలుపుదల చేపట్టకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో జిల్లా కమిటీ సభ్యురాలు టి.కౌసల్య, జె.సునీల్, కె శరబన్న, అచ్యుతరావు పాల్గొన్నారు.

హుకుంపేట: తహశీల్దార్ రాజ్యలక్ష్మికి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె.రామారావు, టి.కృష్ణారావు మాట్లాడుతూ, మైదాన ప్రాంతం నుండి బదిలీలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జి.మాడుగుల: తహసీల్దార్‌కు ఆదివాసీ గిరిజన సంఘం నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి కొటారి కోటేశ్వరరావు, జివో 3 సాధన కమిటీ జిల్లా సహాయ కార్యదర్శి మత్స్యరాస నారాయణరాజు, మాట్లాడుతూ జీవో 3ని పునరుద్ధరించాలన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం పూర్వ మండల కార్యదర్శి జె దీనబంధు, కరుణానిధి, జివో 3 సాధన కమిటీ నాయకులు సన్యాసి పడాల్, రత్నకుమారి పాల్గొన్నారు.

కొయ్యూరు: జీవో 3 ప్రకారం ఏజెన్సీలో గిరిజన ఉపాధ్యాయులని నియమించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు జె.పెంటయ్య, కార్యదర్శి పి.గంగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దారు తిరుమల రావుకి వినతిపత్రం అందజేశారు. జీవో నెంబర్ 3పై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ ఉండగా, 400 మందిని వివిధ పాఠశాలలో బదిలీ చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకుడు ఇరువాడ దేముడు, గిరిజన సంఘం నేత సరుమూర్తి సూరిబాబు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష లక్ష్యం

అర్హులకు పథకాలు అందించడమే..

-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: అర్హత కలిగిన లబ్దిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే జగనన్న సురక్ష పథకం లక్ష్యమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లాలోని తహశీల్దారులు, ఎంపిడిఓలు, వెలుగు అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న సురక్ష పథకం అమలు, విధి విధానాలను అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండల స్థాయిలో ఎంపిడిఓలు, తహశీల్దారులు వేరు వేరుగా రెండు బృందాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. బృందాలలో మండల స్థాయి అధికారులను సభ్యులుగా చేర్చాలన్నారు. ముందుగా పర్యటన షెడ్యూలు తయారు చేసుకోవాలని సూచించారు. ఈనెల 20 జగనన్న సురక్ష పథకం అమలుపై శిక్షణా తరగతులు నిర్వహిం చాలన్నారు. ఈనెల 24వ తేదీ గ్రామ సచివాలయాలు సందర్శించి జగనన్న సురక్ష పథకంపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఈనెల 24 నుండి సెక్రటేరియట్ సిబ్బంది, వాలంటీర్లు ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకోవాలని ఆదేశించారు. లబ్దిదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జారీపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జూలై 1.వ తేదీ నుండి సచివాలయం స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ, కుటుంబ సభ్యుడి దృవీకరణ పత్రాలు, మ్యుటేషన్ లావాదేవీలు, ఆధార్కు ఫోన్ నంబర్ అనుసంధానం, పంట సాగు హక్కు కార్డు (సిసిఆర్‌సి) కార్డులు వెంటనే జారీ చేయాలని స్పష్టం చేసారు. ప్రతీ శిబిరంలో మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. కొత్త కార్డుల జారీ, ఆధార్ కార్డులలో సవరణల ప్రక్రియ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, పాడేరు ఐటిడిఏ పి.ఓ వి.అభిషేక్, రంప చోడవరం పి ఓ సూరజ్ గనోరి, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఆర్‌డిఓ పి. అంబేద్కర్, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, డిఎల్‌పిఓ పి.ఎస్.కుమార్, డిఆర్‌డిఏ పీడీ వి.మురళి పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్

అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో మాటాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

125 మందికి అక్రిడిటేషన్లు మంజూరు

ప్రజాశక్తి-పాడేరు: విధి నిర్వహణలో పాత్రికేయులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. సోమవారం కలక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జిల్లా కలక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కలక్టర్ కమిటీ సభ్యులతో చర్చించి ప్రభుత్వ ఉత్తర్వులననుసరించి అర్హత కలిగిన 125 మందికి కమిటీ అక్రిడిటేషన్లు మంజూరు చేసింది. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ, పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు పరిశీలించాలని, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలు పరిశీలించి తదుపరి సమావేశంలో నిర్ణయం తీసుకోవటానికి ప్రతిపాదించాలని డిపిఆర్ఓ గోవింద రాజులును ఆదేశించారు. మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో కన్వీనర్ డిపిఆర్ఓ పి. గోవింద రాజులు, సభ్యులు హౌసింగ్ ఇఇ పి. బాబు, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ రాజేష్, ప్రజా రవాణా శాఖ డిపో మేనేజర్ వి. శ్రీనివాస్, కార్మిక శాఖ ఉప కమిషనర్ టి.సుజాత, అరకు రైల్వే స్టేషన్ మేనేజర్ రాహుల్, రిపోర్టర్లు కె.దుర్గారావు, డి.రామచంద్రరావు, శ్రీనివాసరావు, వి.మత్స్యలింగం, డివిజినల్ పౌర సంబంధాల అధికారి పండు రాములు, సంధ్య రాణి పాల్గొన్నారు.

పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న పిఒ

పాఠశాలను తనిఖీ చేసిన పిఒ

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో కే.కోడపల్లి పంచాయతీ బంధవీధి గ్రామంలో గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సోమవారం ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. మెనూ సక్రమంగా అమలు చేయలేదని, జగనన్న కిట్లను ఇప్పటివరకు విద్యార్థులకు పంపిణీ చేయక పోవడంపై హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పాఠశాలలు తెరుచుకొని కొన్ని రోజులు కావస్తున్నా ప్రధానోపాధ్యాయురాలు సెలవులో ఉండటం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న విద్య కానుక కిట్లను విద్యార్థులకు అందజేయడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విశాఖకు ఫిలిం పరిశ్రమ తరలిరావాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రకృతి అందాలకు నిలయమైన విశాఖకు ఫిలిం పరిశ్రమ తరలిరావాలని ఎపి మా గౌరవాధ్యక్షులు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ కోరారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో హెల్త్ కార్డులను సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖకు ఫిల్మ్ ఇండస్ట్రీ తరలిరావటానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పిస్తున్నారని తెలిపారు. విశాఖ సినిమా హబ్‌కు నిలయమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌నాయుడు, మురళి, వర్మ, సురేష్, జెటి.రామారావు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలల్లో సీట్ల సంఖ్యను పెంచాలి

జెడ్‌పిటిసి గంగరాజు

విద్యార్థుల సమస్యలడిగి తెలుసుకుంటున్న జెడ్‌పిటిసి సభ్యులు గంగరాజు

ప్రజాశక్తి- అరకులోయ : ఏజెన్సీ ప్రాంతంలోని ఏకలవ్య పాఠశాలల్లో సీట్ల సంఖ్య పెంచాలని అనంతగిరి మండల జెడ్పిటిసి సభ్యుడు దీసరి గంగరాజు కోరారు. సోమవారం అరకులోయను సందర్శించిన ఆయన వైటిసి భవనంలో నిర్వహిస్తున్న అనంతగిరికి చెందిన ఏకలవ్య పాఠశాలను ఆయన సందర్శించారు. ఏకలవ్య పాఠశాల పరిస్థితి, సీట్లు, భవనాల పరిస్థితి పై స్పోర్ట్స్ స్కూల్, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ పి.ఎస్.ఎన్ మూర్తి, అరకులోయ ఎంఈఓ భారతి రత్నంతో చర్చించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి గంగరాజు మాట్లాడుతూ, ఖో- ఎడ్యుకేషన్‌తో నడుస్తున్న ఏకలవ్య పాఠశాలల్లో సంవత్సరానికి బాలికల సీట్లు 30, బాలుర సీట్లు 30 మాత్రమే కేటాయించడంతో అనేకమంది గిరిజన విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీలో గిరిజనులు విద్య పట్ల ఆసక్తి చూపుతున్న తరుణంలో ప్రభుత్వం సీట్ల కేటాయింపును పెంచాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక ఉన్నతమైన లక్ష్యంతో ఏకలవ్య పాఠశాలలు మంజూరు చేసిందని, వసతి సమస్య ఏర్పడటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే పాఠశాలకు భవనాలను మంజూరు చేయాలని ఆయన కోరారు. అనంతగిరి మండలంలో మంజూరైన ఏకలవ్య భవన నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏకలవ్య పాఠశాలలకు భవనాలు లేక పోవడంతో అరకులోయలోని వైటిసి భవనంలోనే అరకులోయ, అనంతగిరి మండలాలకు రెండు ఏకలవ్య పాఠశాలలు ఒకే చోట నిర్వహిస్తున్నారని తెలిపారు. డుంబ్రిగుడ మండలానికి సంబంధించిన ఏకలవ్య పాఠశాల కూడా అరకులోయ లోనే నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. ఏకలవ్య పాఠశాలలో సరిపడా భవనాలు లేకపోవడంతో విద్యార్థులందరూ ఒకటి, రెండు గదులకే పరిమితమై ఇరుకుగా కూర్చుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకునే విద్యార్థుల సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతుండడంతో ప్రతి మండల కేంద్రంలో గురుకుల బాలుర, బాలికల పాఠశాలలు నెలకొల్పాలని ఆయన కోరారు. పిటిజి బాలికల పాఠశాల కూడా పెట్టాలని ఆయన అన్నారు. ఏకలవ్య పాఠశాలలో సీట్లు, వసతి వంటి సమస్య లపై అల్లూరి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్ళనున్నట్లు గంగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరకులోయ ఏపీఏజిఎస్ నాయకులు రామన్న, ఏకలవ్య విద్యార్థుల పేరెంట్స్ సింహాద్రి, రాజు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల పనుల పరిశీలన

ప్రజాశక్తి-పాడేరు: పాడేరులో రూ.500 కోట్లతో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఆసుపత్రి పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని రాష్ట్ర మెడికల్ సర్వీసెస్, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి. మురళీధర్ రెడ్డి నాగార్జున నిర్మాణ సంస్థ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాలో పర్యటించిన ఎండి నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల పనులను జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండి మాట్లాడుతూ, డిసెంబర్ లో నేషనల్ మెడికల్ కౌన్సిల్ తనిఖీలు ఉన్నందున ఎన్.ఎం.సి నిబంధనల ప్రకారం నిర్మాణాలు జరగాలని స్పష్టం చేసారు. కళాశాల లెక్చర్ హాలులు, లైబ్రరీ, లేబరేటరీ తదితర ముఖ్యమైన బ్లాకులు నిర్మాణానికి ప్రాధాన్యత నిచ్చి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కలక్టర్ సూచనలను పరిగణనలోకి తీసుకుని ఎప్పటికప్పుడు నిర్మాణాల ప్రగతిని నివేదించాలని ఆదేశించారు. ఆసుపత్రితో పాటు, కళాశాల, వసతి గృహం, నర్సింగ్ కళాశాల నిర్మాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా కేంద్ర ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అవసరమైన సదుపాయాలు, అవసరమైన పరికరాలపై ఆరా తీసారు. ఈ పర్యటనలో ఎపిఎమ్ఎస్ఐడిసి పర్యవేక్షక ఇంజినీర్ శివకుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్ అచ్చుం నాయుడు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ వర్మ, సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ సురేష్, ఆసుపత్రి పర్యవేక్షకులు కృష్ణారావు, నాగార్జున కన్స్ట్రక్షన్స్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలిసున్న ఎమ్‌డి

ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు

సమస్యలపై ఉపాధ్యాయుల వినతి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణని ఎపి ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నాయకులు కోరారు. పాడేరులోని నివాసంలో సోమవారం ఎమ్మెల్యేను ఫ్యాప్టో స్థానిక నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. సిపిఎస్ ను రద్దు చేయాలని, పిఆర్‌సి, ఇతర బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న వైఖరిని నిరోధించాలని, జిఒ నం.117ను రద్దు చేయాలని కోరారు. బోధనేతర పనుల నుండి ఉపాధ్యాయులను మినహాయించి, చట్టబద్ధమైన 12వ పిఆర్ సి కమిటీ వెంటనే నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ఆర్.జగన్ మోహన్ రావు, ఎం.రామకృష్ణ, ఎస్.శేషగిరిరావు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీ కొన్న బైక్

పర్యాటకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలోని పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం సమీపంలో 516 ఈ హైవే రోడ్డు మలుపు వద్ద సోమవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు రోడ్డు రక్షణ కంచె డివైడర్ ను బైక్ ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ పర్యాటకుడికి తీవ్ర గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలు... విశాఖపట్నం మధురవాడకు చెందిన లకకుల రాజేష్ భార్య భర్తలు. అరకు నుంచి జలపాతం తిలకించేందుకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా డివైడర్‌ను బైక్ ఢీకొంది. పర్యాటకుడికి తీవ్ర గాయాలు కావడంతో అరకు లోయ ప్రాంతీయ హాస్పిటల్‌కు తరలించారు.

విద్యార్థులకు మెడల్ అందిస్తున్న ప్రిన్సిపల్

టెన్త్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-పెదబయలు: స్థానిక బాలుర గిరిజన రెసిడెన్సియల్ పాఠశాలలో టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్ధార్థులు భరత్ నాయుడుకు ముడు వేలు, నానీబాబుకు రెండు వేలు, శ్రీకాంత్‌కు వెయ్యి రూపాయలు నగదు, గోల్డ్ మెడల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్, ప్రిన్సిపల్ శంకర్‌రావు అందజేశారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పలువురు అభినందించారు.

విశాఖలో శాంతి భద్రతలు ప్రశ్నార్థకం : సిపిఐ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రాష్ట్రంలోనే అత్యంత ప్రధానమైన, ప్రశాంతమైన నగరంగా పేరొందిన విశాఖపట్నంలో శాంతి భద్రతలు రోజురోజుకూ క్షీణిస్తున్నాయని, రౌడీ షీటర్ల ఆగడాలు శృతిమించి పోవడంతో నగర ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు పేర్కొన్నారు. నగరంలో ఇటీవల వెలుగుచూసిన కిడ్నాప్ ఉదంతాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిపిఐ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వ నిఘా వర్గాల వైఫల్యం విశాఖ నగరంలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ కుటుంబ సభ్యుల కిడ్నాప్ ఘటన నగరంలోని శాంతి భద్రతల పరిస్థితిని మరోసారి చర్చకు పెట్టిందన్నారు. ఎంపీ కుటుంబ సభ్యులకే భద్రత కరువైన నేపథ్యంలో సాధారణ ప్రజల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. అనంతరం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందించారు. సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎ.విమల, ఎస్‌కె.రెహమాన్, ఆర్.శ్రీనివాసరావు, పి.చంద్రశేఖర్, జి.రాంబాబు, కె.సత్యంజనేయ, సిఎన్.క్షేత్రపాల్ పాల్గొన్నారు.

ఆర్‌బికెల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రాష్ట్రంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 4,765 పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన అనంతరం స్పందనలో జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.రాంబాబు, అధ్యక్షులు కె.అచ్యుతరావు మాట్లాడుతూ, రాష్ట్రంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 4,765 పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ల (ఎహెచ్‌ఎ) పోస్టులను భర్తీ కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు 3 నుంచి 5 రైతు భరోసా కేంద్రాలను కలుపుతూ ఒక క్లస్టర్ ఏర్పాటుచేసి ఆర్‌బికెల్లో పోస్టులను మిగులు చూపించి ఎహెచ్‌ఎ పోస్టులు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలోనే క్లస్టర్ విధానాన్ని అమలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఎఐవైఎఫ్ ఖండిస్తుందన్నారు. 4,765 పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, లేకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు.

ఐఎన్ఎస్ శివాలిక్‌పై యోగా ప్రదర్శన

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా భారతీయ నౌకాదళం ఇండోనేషియాలోని జకార్తాలో ఐఎన్ఎస్ శివాలిక్‌పై యోగాను ప్రదర్శించింది. ఈ ప్రదర్శనలో భారతీయ ప్రవాసులు, ఇండోనేషియా నేవీ సిబ్బంది, ఇండియన్ ఎంబసీ అధికారులు, స్థానిక పౌరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఓఎఫ్‌సి కేబుల్ పనుల పూర్తి

విద్యుత్ స్తంభాలపైనుంచి వేస్తున్న ఓఎఫ్‌సి కేబుల్

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జల విద్యుత్తు కేంద్రానికి ఓఎఫ్‌సి కేబుల్ నిర్వహణ పనులు సోమవారం సాయంత్రానికి పూర్తి చేసినట్లు ఏపీ జెన్కో ఏఈ కిరణ్ కుమార్, సబ్ ఇంజనీర్ విజయలక్ష్మి తెలిపారు. సోమవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఓఎఫసి కేబుల్ నిర్వహణ పనులు స్థానిక ఏపీ జెన్కో సర్వర్ నుంచి జల విద్యుత్ కేంద్రం వరకు 3000 మీటర్లు ఇంటర్నెట్ కేబుల్ విద్యుత్ పోల్లు పైనుంచి రన్ చేశామని చెప్పారు. సీలేరు జల విద్యుత్ కేంద్రంలో తరచు ఇంటర్నెట్ సౌకర్యం సెల్ సిగ్నల్‌కు సాంకేతికపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఆరేళ్ల క్రితం స్థానిక ఏపీ జెన్కో చెక్‌పోస్టు నుంచి జల విద్యుత్ కేంద్రం వరకు అండర్ గ్రౌండ్ కేబుల్‌ని ఇంటర్నెట్ సౌకర్యం సెల్ సిగ్నల్ కోసం రన్ చేశామని తెలిపారు. కొన్ని సాంకేతికపరమైన ఇబ్బందుల వల్ల ఇంటర్నెట్ సేవలు సెల్ సిగ్నల్‌కు తరచూ సమస్యలు ఏర్పడుతున్నాయని చెప్పారు. ముందు ముందు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం దిశగా ఓఎఫ్‌సి కేబుల్‌ని జల విద్యుత్ కేంద్రం వరకు రన్ చేసి ఇంటర్నెట్ సెల్ సిగ్నల్ పూర్తిస్థాయిలో ఉండేలా సౌకర్యం కల్పించాలని తెలిపారు. స్థానిక జల విద్యుత్ కేంద్రం చుట్టుపక్కల ఉన్న మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న గిరిజన గ్రామాలకు సెల్ సౌకర్యం ఓఎఫ్‌సి కేబుల్ ద్వారా పొందవచ్చున్నారు. ఇంజనీర్లు సిబ్బంది సమిష్టిగా ఎండను సైతం లెక్కచేయకుండా పనులు పూర్తి చేశామని వెల్లడించారు.

ఎంఇఒగా రామన్న పడాల్

ఎంఇఒ పడాల్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండల విద్యాశాఖాధికారిగా కె.రామన్న పడాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా 2019 నుండి ఈ ఏడాది జూన్ 7 వరకు విధులు నిర్వహించారు. ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ఈనెల 8న పెదబయలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బదిలీపై వెళ్లారు. అక్కడ ఈ 18 వరకు విధుల్లో కొనసాగారు. రామన్నపడాల్‌కు ఎంఈఓగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం ఉదయం జికె.వీధి మండల కేంద్రంలో ఎంఇఒగా రామన్నపడాల్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు రామన్నపడాల్‌కు బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రామన్న పడాల్ మాట్లాడుతూ అధికారులు అప్పజెప్పిన బాధ్యతలను తూచతప్పగా పాటిస్తూ విధి నిర్వహణ చేస్తానని చెప్పారు.

ఎంఇఒ-2గా సరియం రాజులు

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంఇఒ రాజులు

ప్రజాశక్తి -ఎటపాక : మండల విద్యాశాఖాధికారి-2గా సరియం రాజులు సోమవారం నాడు బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీఓ విఠల్ పాల్, ఎంఈఓ నీలి బాలరాజు నియామక పత్రాలు సరియం రాజులుకు అందజేశారు. గుండాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా ఉన్న సరియం రాజులు ఆదివారం కాకినాడలో జరిగిన కౌన్సెలింగ్‌లో ఎటపాక మండల విద్యాశాఖాధికారి-2గా ఉద్యోగోన్నతి పొందారు.

'జగనన్న ఆణిముత్యాలు' పురస్కారాల అందజేత

సీలేరు, రంపచోడవరంలలో జగనన్న విద్యాకానుక కిట్లను అందజేస్తున్న నేతలు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు సోమవారం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, ఇన్‌ఛార్జి సర్పంచ్ కె.వల్లి ప్రసాద్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నీతూ చేతుల మీదుగా ప్రథమ స్థానంలో నిలిచిన కిల్లో సాయికుమార్ రూ. 3వేలు, గోల్డ్ మెడల్, ద్వితీయ స్థానంలో నిలిచిన ఎస్.హిమబిందుకు రూ.2000, సిల్వర్ మెడల్, తృతీయ స్థానంలో నిలిచిన ఎస్‌కె.సబ్నంకు వెయ్యి రూపాయలు, బ్రౌన్ మెడల్, ముగ్గురికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం డివి.కామేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శిరీష, లలిత, జి.దామోదర్, జి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం : రంపచోడవరం మండలం, ముసులుమిల్లి ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన చిచోడి యుగంధర్ (522), ద్వితీయ స్థానం కారం గౌరిశంకర్ (508), మూడు స్థానంలో నలిచిన సిరసం సాయి కుమార్‌కు నగదు బహుమతి, మెడల్స్, సరిఫికెట్లును ఎంపీటీసీ వంశి కుంజం, హెచ్‌ఎం కెఆర్‌పి కుమార్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం విద్యార్థులకు జగన్నన్న విద్య కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, వార్డ్ మెంబర్ రామలక్ష్మి, వైసిపి నాయకులు విక నాగేశ్వరరావు, బోబ్బా శేఖర్ కుమార్, వార్డెన్ బొండాల ప్రసాద్ పాల్గొన్నారు.

రంపచోడవరం ప్రభుత్వ పాఠశాలలో..

రంపచోడవరం ప్రభుత్వ పాఠశాలలో ఎంఇఒ కెవివి.సత్యనారాయణ దొర ఆధ్వర్యాన పదో తరగతిలో అధ్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జెడ్‌పిటిసి పండా వెంకట లక్ష్మి, ఎంపిపి బందం శ్రీదేవి, సర్పంచ్ మంగ బొజ్జయ్య చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్య కమిటీ చైర్మన్ పి వెంకట రమణ, వైస్ ఎంపిపి కొమ్మిశెట్టి బాలకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వినతులుస్వీకరిస్తున్న పిఒ సూరజ్ గనోరే, ఇతర అధికారులు

స్పందనకు 53 అర్జీలు

ప్రజాశక్తి - రంపచోడవరం : స్థానిక ఐటిడిఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 53 అర్జీలు అందాయి. వీటిని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఎపిఒ సిహెచ్.శ్రీనివాసరావు స్వీకరించారు. రాజవొమ్మంగిలో 2004 నుండి కొండపోడు వ్యవసాయం చేసుకుంటున్న 9 మంది గిరిజనులకు పట్టాల మంజూరు చేయాలని బాధిత గిరిజన రైతులు, దేవీపట్నం మండలం కచ్చులూరులో పోలవరం ప్రాజెక్టు ముంపునకు గురైన బాధితులకు సంబంధించిన డి.పట్టా భూములకు, వివిధ రకాల మొక్కలకు నష్టపరిహారం ఇవ్వాలని బాధితులు దరఖాస్తులు సమర్పించారు. మారేడుమిల్లి పిహెచ్‌సి దగ్గరిలో ఉన్న గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందించాలని, వై.రామవరం మండలం చింతలపూడి పంచాయతీ పరిధి వీడరేవు కాలువపై వంతెన ఏర్పాటు చేయాలని, వాటర్ షెడ్ పథకం ద్వారా ఏర్పాటు చేసిన సోలార్ సెట్లు పనిచేయటం లేదని, వాటికి మరమ్మతులు చేయాలని, రంపచోడవరం మండలం ఆకూరుకు చెందిన రబ్బర్ రైతులకు రబ్బర్ ప్రాసెస్ పరికరాలు ఏర్పాటు చేయాలని అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డిఎస్ శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, ఎండి యూసఫ్ పీహెచ్‌ఓ కె.చిట్టిబాబు, తహశీల్దారు పి.వెంకటేశ్వరరావు, డిఎల్‌డిఓ కె.కోటేశ్వరరావు, రీజనల్ మెడికల్ ఆఫీసర్ ఒ.బి.ఇందిరా, వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు, ప్రాజెక్ట్ ఆర్టికల్చర్ అధికారి రాంబాబు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు సిహెచ్‌కెవి.చౌదరి, ఏఎంవో సి.శ్రీహరి, ఏడిఎంహెచ్‌ఓ డాక్టర్ అనూష, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్లాట్లు ఇవ్వాలని ల్యాండ్‌పూలింగ్ నిర్వాసితుల వినతి

ప్రజాశక్తి-పద్మనాభం: ల్యాండు పూలింగ్‌లో భూములు కోల్పోయిన తమకు నిబంధనల మేరకు ఇస్తామన్న ప్లాట్ల కేటాయించాలని మండలంలోని నేరేళ్లవలస, తునివలస గ్రామాల్లోని నిర్వాసితులు సోమవారం స్పందనలో జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. నేరేళ్లవలసలోసర్వే నెంబర్ 102లో నక్కాన సన్యాసమ్మ, నక్కాన రమణమ్మలకు చెందిన 1.20 ఎకరాలు, సర్వే నెంబర్ 54లో కె అప్పయ్యమ్మకు చెందిని మూడున్నర ఎకరాలను భూమిని ల్యాండ్ పూలింగ్‌లో సేకరించారన్నారు. స్థానిక జెడ్‌పిటిసి సుంకర గిరిబాబు తమతో బలవంతంగా అగ్రిమెంట్లు రాయించి, నామమాత్రంగా ఆడ్వాన్సులు చెల్లించి, మిగతా డబ్బులు ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ల్యాండ్ పూలింగ్‌లో ప్రభుత్వం తమపేరిట ఇచ్చిన పట్టాలను కూడా తన వద్దనే ఉంచుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి తగు చర్యలు చేపట్టి, తమకు న్యాయం చేయాలని వీరు వేడుకుంటున్నారు.

అడవుల రక్షణకు కృషి

ఎఫ్ఆర్‌ఒగా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరణ

ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విఆర్.పురం : భవిషత్‌లో అడవుల రక్షణే ధ్యేయంగా పని చేస్తానని విఆర్ పురం నూతన ఎఫ్ఆర్ఒ సోమవారం విధుల్లో చేరిన కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇక్కడ ఇప్పటి వరకు రేంజ్ అధికారిగా పని చేసిన శ్రీనివాసరెడ్డి ఏలూరు రేంజ్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏలూరు అటవీ డివిజన్ నుండి బదిలీపై శ్రీనివాసరావు ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎఫ్ఆర్ఒ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధానంగా అడవుల నరికివేత చర్యలను అడ్డుకుంటామని, అందుకు సిబ్బంది, ఉద్యోగులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'సేవాస్ఫూర్తి' మహిళల సేవాభావం

అనాథ మహిళకు సపర్యలు చేస్తున్న సేవా స్ఫూర్తి మహిళలు

ప్రజాశక్తి - ఆరిలోవ : రవీంద్రనగర్‌లో సేవాస్ఫూర్తి భవనం సమీపంలో నిరుపయోగంగా ఉన్న బస్‌స్టాపు వద్ద కొద్దికాలంగా మతిస్థిమితం లేని ఓ మహిళకు సేవాస్ఫూర్తి మహిళలు సపర్యలు చేసి తమ ఔదార్యం చాటుకున్నారు. అనాథ మహిళకు రోజూ అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజనాలు అందించారు. ఇటీవల ఆ అనాథ మహిళ శుభ్రత లోపించడం, శరీరం అంతా మురికిగా మారి, అంటు రోగాల బారిన పడిన పరిస్థితిని గమనించిన సేవాస్ఫూర్తి మహిళలు ఆమెకు శుభ్రంగా స్నానం చేయించి, బట్టలు మార్పించి సపర్యలు చేసి ఆమె రూపు రేఖలు మార్చారు. మొల్లి అనిత, ఒమ్మి వేణు, ఒమ్మి భాగ్యలక్ష్మీ, ఒమ్మి పార్వతి, మొల్లి శ్రీదేవి, మన్యాల అనూష, ఉప్పిలి వెంకట లక్ష్మీ, తదితరులు అనాథ మహిళకు సపర్యలు చేసిన వారిలో ఉన్నారు.

సేవకులకు సత్కారం

ప్రజాశక్తి -ములగాడ : 40వ వార్డు పరిధి ఎకెసి కాలనీలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో కరోనా సమయంలో ఉత్తమ సేవలు అందించిన వార్డు పరిధిలోని పారిశుధ్య, సచివాలయం సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది, ఆశ వర్కర్లు, వార్డు వాలంటీర్లు, సచివాలయం కన్వీనర్లును వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు సత్కరించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ శ్రీహరిపురం బ్రాంచ్ సిస్టర్స్ సింధు, అనురాధ, చిన్న అప్పారావు పాల్గొని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో తాండూరు ఎమ్మెల్యే

ప్రజాశక్తి- సింహాచలం: సింహాద్రి అప్పన్నను సోమవారం తెలంగాణ రాష్ట్ర తాండూరు నియోజకవర్గం ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు సాంప్రదాయ ప్రకారం సాదరంగా స్వాగతం పలికారు. ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగం చేసుకొని బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేసి, స్వామి అంతరాలయంలోనూ గోదాదేవి సన్నిధిలోను గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకుల ఆశీర్వదించుగా అధికారులు స్వామి ప్రసాదాన్ని అందించారు.